క్లుప్తంగా

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ

దుండిగల్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు వరద బాధితుల కుటుంబాలకు నిత్యావసరలను పంపిణీ చేస్తున్నారు. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి 50 నిత్యవసరాల కిట్లను బుధవారం యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి, తెలంగాణ ఇన్‌చార్జి సురభి ద్వివేది, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనరెడ్డిలకు అందజేశారు. విపత్తు సమయంలో బాధితులను ఆదుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ముందుంటుందని పేర్కొన్నారు.

గండిమైసమ్మ- దుండిగల్ తహసీల్దార్‌గా సుచరిత

దుండిగల్: గండిమైసమ్మ-దుండిగల్ మండల తహసీల్దార్‌గా టి.సుచరిత బుధవారం నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న పద్మప్రియ పదోన్నతిపై నిర్మల్ జిల్లా ఆర్డీవోగా వెళ్లగా ఆమె స్థానంలో సుచరిత రంగారెడ్డి జిల్లా నుంచి ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు చేపట్టిన ఆమెను డిప్యూటీ తహసీల్దార్ ఎండీ రెహమాన్, జూనియర్ అసిస్టెంట్ అగస్త్యన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు భారతి, శ్రీలక్ష్మీ సిబ్బంది సత్కరించి అభినందనలు తెలిపారు. రెవెన్యూ, పౌర సేవల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విధులు నిర్వహిస్తామని సుచరిత పేర్కొన్నారు.

కేఎం ప్రతాప్‌కు చిరు సత్కారం

రంగారెడ్డినగర్: చిరు వ్యాపారుల సమస్యలను పరిష్కరించేందుకు తాను ఎప్పుడు సిద్ధంగా ఉంటానని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కె.ఎం.ప్రతాప్ అన్నారు. జీడిమెట్ల గ్రామం, అంగడిపేట్, ఎన్‌హెచ్-44 లను ఆనుకుని వ్యాపారాలు నిర్వహించే పలువురు వీధి వ్యాపారులు బుధవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. వ్యాపారాలు సజావుగా కొనసాగించుకునేందుకు ఐడీ కార్డులు ఇప్పించడంలో కృషి చేసిన ప్రతాప్‌కు కృతజ్ఞతలు తెలిపి సత్కరించారు.

అన్నదానం

కుత్బుల్లాపూర్: మన సంపద రియాల్టర్స్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ మట్ట శ్రీనివాసరావు జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం ఆ సంస్థ సభ్యులు మధుసూదనాచారి ఆధ్వర్యంలో రాజేష్ తూబాటి, పృథ్వీరాజ్, శ్రీదేవి, సత్యనారాయణ, గంగిరెడ్డి, రాజేష్, జార్జ్‌లతో కలిసి బాలానగర్ పరిధి అమృత్‌నగర్ తాండా లోని 500 మంది పేద ప్రజలకు మట్ట శ్రీనివాసరావు చేతుల మీదుగా అన్నదానం నిర్వహించారు.

ఎమ్మెల్యేను కలిసిన ఓక్షిత్ ఎన్‌క్లేవ్ నూతన కార్యవర్గం



సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ ఓక్షిత్ ఎన్‌క్లేవ్ ఫేజ్-1 వేల్ఫేర్ అసోషియేషన్ కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కొత్త కమిటీ సభ్యులు బుధవారం కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అసోషియేషన్ అధ్యక్షుడిగా బీవీసురపరాజు, ఉపాధ్యక్షుడిగా ఎస్.శంకరాచారి, కోశాధికారులుగా కే.సతీష్, వినయ్‌కుమార్, జనరల్ సెక్రటరీగా అమరేష్, జాయింట్ సెక్రటరీలుగా రాములు, ప్రవీణ్‌లు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రఘు నంబీ, అడ్వైజర్లుగా తిరుపతిరెడ్డి, రమాచారిలు, కమిటీ సభ్యులుగా జి.సంతోష్, ఏ.సురేష్, ఎస్.లోకేష్, విజయ్‌కుమార్, మహమూద్‌పాషా, చింత కిరణ్‌కుమార్‌లను ఎన్నుకున్నారు.

రాజస్థానీలకు శ్మశానవాటిక స్థలం కేటాయించాలి

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్‌లో ఐదు దశాబ్దాలుగా ఉంటున్న రాజస్థానీలకు శ్మశానవాటిక స్థలం కేటాయించాలని సిర్వి సమాజ్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ సంజీవరావును కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 5500 మార్వాడి కుటుంబాలు నివసిస్తున్నాయని, 20వేల జనాభా కలిగిన తమకు శ్మశానవాటిక స్థలం లేనందున ఎంత ఇబ్బందులు గురవుతున్నామని పేర్కొన్నారు. తమ సమస్యను పరిష్కారమయ్యేలా తమకు శ్మశానవాటిక స్థలం కేటాయించాలని కోరారు.

విద్యార్థులకు దంత పరీక్షలు

నిజాంపేట్: బాచుపల్లిలోని వీఆర్ఎస్ విజ్ఞాన జ్యోతి పాఠశాలలో బుధవారం మమత మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో ఓరల్ హెల్త్ అవేర్‌నెస్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ కళాశాల ఎండీ డాక్టర్ నయన్‌రాజ్, డెంటల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్ నేతృత్వంలో 10 మంది వైద్యుల బృందం 1350 మంది విద్యార్థులకు దంత పరీక్షలు చేశారు. నోటి దుర్వాసన రాకుండా పళ్లను శుభ్రం చేసుకోవాలని, చిగుళ్ల నుండి రక్తం కారితే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.



డా.బీఆర్ అంబేద్కర్ సర్కిల్ సమీపంలో..

డేంజర్ యమడేంజర్!

ప్రాణాలు తీస్తున్న గుంతల రోడ్లు



దీక్షిత మృతికి కారణమైన గుంత



ప్రగతినగర్ ప్రధాన రోడ్డులో దుస్థితి

- నిత్యం ఏదో ఒక ప్రాంతంలో ప్రమాదాలు
- గాయాల పాలవుతున్న వాహనదారులు
- ప్రాణాలు పోయినప్పుడే వెలుగులోకి వస్తున్న ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం
- రోడ్లకు మరమ్మతులు చేపట్టడంలో అధికారులు విఫలం

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో రోడ్ల దుస్థితి అధ్వానంగా మారింది. కొంత కాలంగా ప్రగతినగర్, నిజాంపేట్, బాచుపల్లి ప్రాంతాల్లోని ప్రధాన రోడ్లపై ఏర్పడిన గుంతలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్ల మరమ్మతుల విషయంలో అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రతిపక్ష పార్టీల నాయకులు ఆరోపిస్తున్నారు. రోడ్ల మరమ్మతుల విషయంలో అప్రమత్తంగా ఉండాల్సిన అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించడంపై వాహనదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. గుంతలమయమైన రోడ్లపై వర్షం కురిసిన ప్రతి సారి గుంతల్లో నీళ్లు నిలిచి ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. నిత్యం పర్యావేక్షించాల్సిన అధికారులు, ప్రజల ఇబ్బందులను పరిష్కారించేందుకు చర్యలు తీసుకోవాల్సిన ప్రజాప్రతినిధులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి.

ద్విచక్ర వాహనదారులకు తప్పని ప్రమాదాలు..

ద్విచక్ర వాహనదారులు రోడ్లపై ఏర్పడిన గుంతల్లో పడి తీవ్ర గాయాలపాలై అవస్థలు పడుతున్నారు. రాత్రి సమయాల్లో గుంతల్లో నిలిచిన నీరుతో గుంతలను గుర్తించే పరిస్థితి లేదు. వేగంగా వస్తున్న బైక్‌లు గుంతల్లో పడి ప్రమాదాలకు బారిన పడటం పరిపాటిగా మారింది. ఎవరైన ప్రమాదాల బారిన పడి చనిపోయినప్పుడు మాత్రమే ఈ సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయి.

దీక్షిత మృతికి గుంతల రోడ్డే కారణం..

బాచుపల్లిలోని రోడ్డు ప్రమాదంలో 3వ తరగతి చదువుతున్న దీక్షిత(8) మృతికి రోడ్డుపై ఉన్న గుంతలు కూడా కారమనే చెప్పవచ్చు. అక్కడ గుంత లేకపోవతే దీక్షిత తండ్రి నడిపిస్తున్న స్కూటీని మెల్లిగా తీసుకువెళ్లాల్సిన అవసరం వచ్చి ఉండేది కాదు. ఇప్పటికైన రోడ్లపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు పూర్తి చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.



రోడ్డుపై ఏర్పడిన గుంతలు



గుంతలమయంగా రోడ్లు



ప్రగతినగర్ శ్రీ కృష్ణగార్డెన్ సమీపంలో..

సంక్షేమ సంఘాలు అభివృద్ధిలో పాలు పంచుకోవాలి



ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజును కలిసిన వివిధ కాలనీల ప్రజలు

కుత్బుల్లాపూర్: సంక్షేమ సంఘాలు కాలనీల అభివృద్ధిలో పాలు పంచుకోవాలని.. అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు అన్నారు. గాజులరామారం డివిజన్ పరిధిలోని ఓక్షిత్ ఎన్‌క్లేవ్ సంక్షేమ సంఘం ఫేస్-1 సువర్ణ రాజు, ఫేస్-2 గోపాల్‌రెడ్డిలను అధ్యక్షులుగా ఎన్నుకోవడంతో బుధవారం వారు కమిటీ సభ్యులతో ఎమ్మెల్సీని మర్యాదపూర్వకంగా కలిశారు. తమ కాలనీలో ఇటీవల నెలకొన్న సమస్యలను, వర్షం వల్ల వస్తున్న ఇబ్బందులను వివరించారు. ప్రస్తుతం జరుగుతున్న నాలా పనులు త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

◆ వర్షం పడ్డ ప్రతిసారి తాము ఇళ్లల్లో ఉండలేకపోతున్నామని అన్నారు. తక్షణమే చర్యలు తీసుకుంటే ఉపయోగ ఉంటుందని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కస్తూరి బాలరాజు, డివిజన్ అధ్యక్షుడు విజయరామిరెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ శ్రీనివాస్ యాదవ్ తదితరులు ఎమ్మెల్సీని కలిసిన వారిలో ఉన్నారు. అదేవిధంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు పలు సమస్యలపై వచ్చి ఎమ్మెల్సీ రాజుకు విన్నవించుకోగా ఆయన దశలవారీగా అభివృద్ధి పనులు చేపడతానని హామీ ఇస్తూ వారికి భరోసా కల్పించారు.

గాజులరామారం - హైటెక్‌సిటీ బస్సు సర్వీసు షురూ

జీడిమెట్ల: గాజులరామారం నుంచి హైటెక్‌సిటీ వేవ్‌రాక్ వరకు బుధవారం కొత్తగా బస్సు సర్వీసు ప్రారంభించినట్లు జీడిమెట్ల బస్ డిపో మేనేజర్ విజయ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. 198/171కే నంబరుతో సర్వీసును ప్రారంభించినట్లు తెలిపారు. ఈ బస్సు ప్రతిరోజు ఉదయం 8.40గంటలకు గాజులరామారం నుంచి బయల్దేరి ఎల్లమ్మబండ, కేపీహెచ్‌బీ మెయిన్‌రోడ్డు, జేఎన్‌టీయూ, కేపీహెచ్‌బీ ఫేజ్-4, హైటెక్‌సిటీ, మైండ్‌స్పేస్, మీదుగా వేవ్‌రాక్‌కి ఉదయం 9.50గంటలకు చేరుకుంటుందన్నారు. తిరిగి సాయంత్రం 6.10గంటలకు వేవ్‌రాక్ నుంచి బయల్దేరి సాయంత్రం 7.20గంటలకు గాజులరామారం చేరుకుంటుందని తెలిపారు. గాజులరామారం నుంచి హైటెక్‌సిటీ వెళ్లే ఉద్యోగులు బస్సు సర్వీసును వినియోగించుకోవాలని డీఎం తెలిపారు.

11 నుంచి బంగారు మైసమ్మ ఆలయ వార్షికోత్సవాలు

దుండిగల్: బౌరంపేటలోని బంగారు మైసమ్మ తల్లి దేవాలయ వార్షికోత్సవ వేడుకలను ఈనెల 11 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. 11వ తేదీ ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం, అలంకరణ, గణపతి పూజ, పుణ్యాహవచనం, మండపారాధన, దేవతా హోమం, మహా నివేదన, తీర్థ ప్రసాద వితరణ, 12న సుప్రభాత సేవ, అర్చనలు, కుంకుమార్చనలు, మహా పుష్పార్చనలు, మహ నివేదన, తీర్థప్రసాద వితరణ, 13న అమ్మవారికి అభిషేకం, అంకరణ, అర్చనలు, వివిధ పూజా కార్యక్రమాలు, అన్నదానం, సాయంత్రం ఫలహార బండ్ల ఊరేగింపు, బోనాల కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ కోరింది.

నాడు భర్తను హత్య చేసి.. నేడు హత్యకు గురైంది!



రేణుక (ఫైల్)

సుభాష్‌నగర్: నాడు కట్టుకున్న భర్తను హత్య చేసి... నేడు ఆమె హత్యకు గురైన సంఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గండి మైసమ్మలోని డాక్టర్ బస్తీలో రేణుక (32) అలియాస్ ధరణి నివాసం ఉంటోంది. ఏడేళ్ల క్రితం సురేష్ అనే వ్యక్తితో వివాహం జరగగా వీరికి దివ్య, లక్కీ అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. అనంతరం గతంలో భర్తతో గొడవ పడి 7 ఫిబ్రవరి 2023న భర్తను హత్య చేసింది. జైలుకు వెళ్లి అనంతరం బెయిల్‌పై వచ్చింది.

◆ ఈ క్రమంలో గండి మైసమ్మలో ఓ ప్రైవేట్ స్కూల్‌లో వాచ్‌మెన్‌గా పనిచేసే సాయి అనే వ్యక్తిని పెళ్లి చేసుకొని ఉంటోంది. హత్య విషయమై మంగళవారం సాయంత్రం జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో సంతకం చేసిన రేణుక ఇంటికి రాలేకపోయింది. బుధవారం ఉదయం సూరారం గ్రామ శివారులోని చిన్న బంధం చెరువు కట్టపై శవం ఉందని పోలీసులకు సమాచారం అందడంతో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా మృతురాలు రేణుకగా గుర్తించారు.

◆ హత్య జరిగిన ప్రదేశంలో ఆధారాల కోసం క్లూస్ టీమ్‌ను రప్పించారు. సంఘటన స్థలాన్ని మేడ్చల్ డీసీపీ శబరీష్, ఏసీపీ వెంకట్‌రెడ్డి సందర్శించి స్థానిక సీఐ వెంకటేశ్వర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఊపిరాడకుండా చేసి చంపేసి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం పూర్తి వివరాలు లభిస్తాయని పేర్కొన్నారు. అంత వరకు రేణుక వాడుతున్న మొబైల్ నంబర్‌కు ఏ నెంబర్ల నుంచి ఫోన్లు వచ్చాయన్న విషయాలను ఆరా తీస్తున్నారు.



రేణుక మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



ఘటనా స్థలంలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీసీపీ శబరీష్

కమ్యూనిటీహాల్ నిర్మాణంలో నిర్లక్ష్యం

నిజాంపేట్: కమ్యూనిటీహాల్ నిర్మాణంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి శ్రీనివాస్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బాలపీరు ఆరోపించారు. బుధవారం నిజాంపేట్ కార్పొరేషన్ 32వ డివిజన్ పరిధిలోని అర్బన్ నర్సరీ వద్ద వారు నిరసన తెలియజేశారు. వారు మాట్లాడుతూ.. రూ.40 లక్షలు కేటాయించి సంవత్సరం క్రితం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారన్నారు. కాని ప్రస్తుతం ఆ ప్రాంతంలో శిలాఫలకం మాయమైందన్నారు. సదరు స్థలాన్ని కబ్జా చేసేందుకు జీవో 59 కింద కొందరు వ్యక్తులు దరఖాస్తు చేశారని ఆరోపించారు. అధికారులు కమ్యూనిటీ హాల్‌ను నిర్మించకుంటే పేదలకు పంచుతామని హెచ్చరించారు.

కాంగ్రెస్‌లో చేరికలు



టీపీసీసీ ప్రతినిధి హన్మంతరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన యువకులు

నిజాంపేట్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే యూత్ కమిషన్ ఏర్పాటు చేసి రూ.10లక్షల వడ్డీ లేని రుణాలు అందిస్తామని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. నిజాంపేట్ రాజీవ్‌గృహకల్పకు చెందిన రాజేష్, సాయి, వీరేందర్, బాబు, నవీన్, మహేష్, దేవేందర్, బాలాజీ మిత్ర బృందం బుధవారం మైనారిటీ సెల్ చైర్మన్ ఎండీ అంజద్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి హన్మంతరెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ యువతకు పెద్దపీట వేస్తోందన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీతో పాటు ప్రైవేట్ కంపెనీల్లో రిజర్వేషన్లు అమలు చేస్తామన్నారు. జేమ్స్, సిద్దనోళ్ల సంజీవరెడ్డి, నిజాంపేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోలన్ రాజశేఖర్‌రెడ్డి, అమృతయ్య, లక్ష్మణ్, దాసరి మహేష్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ దేవేందర్ నగర్‌లోని ప్రభుత్వ స్థలాల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. స్థానికంగా సర్వే నెంబర్ 342 ప్రభుత్వ స్థలంలో కొంత మంది చప్పుడు కాకుండా నిర్మాణాలు చేపట్టారు. దీనిపై సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు బుధవారం అక్కడికి చేరుకుని ఐదు గదులను నేలమట్టం చేశారు.

పింగళి వెంకయ్య జయంతి

సుభాష్‌నగర్: భారత జాతీయ పతాకాన్ని రూపకల్పన చేసి తెలుగు వారి ఖ్యాతిని దేశ ప్రజలకు తెలియజేసిన వ్యక్తి పింగళి వెంకయ్య అని నార్త్ సిటీ స్కూల్ ప్రిన్సిపాల్ కోలా వెంకటేష్ ముదిరాజ్ అన్నారు. గురువారం పింగళి వెంకయ్య జయంతిని స్కూల్ ఆవరణలో నిర్వహించారు. ఆయన చేసిన సేవను విద్యార్థులకు తెలియజేశారు.



మేడ్చల్ జిల్లాలో భారీగా తహసీల్దార్ల బదిలీలు

పోస్టింగ్ ఉత్తర్వులను జారీచేసిన కలెక్టర్ అమయ్ కుమార్

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాకు చెందిన పలువురు తహసీల్దార్లకు రిలీవింగ్, ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారిని వివిధ మండలాలకు అలాట్ చేస్తూ బుధవారం పోస్టింగ్ ఉత్తర్వులను జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ జారీ చేశారు.

ఇద్దరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రిలీవ్

మేడ్చల్ జిల్లాలో పనిచేస్తున్న తహసీల్దార్లను పరిపాలన ప్రాతిపదికన బదిలీ చేస్తూ కలెక్టర్ అమయ్‌కుమార్ రిలీవింగ్ ఉత్తర్వులను అందజేశారు. పదోన్నతిపై డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఘట్‌కేసర్‌లో తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎస్.వి జయలక్ష్మీ భద్రాచలం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా అలాగే, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న పి.పద్మప్రియ నిర్మల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు.

జిల్లాకు బదిలీపై వచ్చిన తహసీల్దార్లు..

ఇతర జిల్లాల నుంచి పలువురు తహసీల్దార్లు మేడ్చల్ జిల్లాకు బదిలీపై రాగా, వారికి పోస్టింగ్ ఉత్తర్వులను కలెక్టర్ జారీ చేశారు. హైదరాబాద్ జిల్లాలో తహసీల్దార్లుగా పనిచేస్తున్న బి.శైలజను మేడ్చల్‌కు, ఎస్.ఎమ్.హసీనాను మేడిపల్లికి అలాట్ చేశారు. జనగామ్ తహసీల్దార్ ఎల్.పూల్‌సింగ్‌ను బాచుపల్లికి, నల్గొండ జిల్లాలోని తహసీల్దార్లు సైదులును కుత్బుల్లాపూర్‌కు, కృష్ణారెడ్డిని ఉప్పల్‌కు, రంగారెడ్డి జిల్లా తహసీల్దార్లు టి.సుచరితను దుండిగల్ గండిమైసమ్మ మండలానికి, అలాగే, ఎల్.రాంమోహన్‌ను మేడ్చల్ కలెక్టరేట్ ఏవోగా, వై.ఎస్ శ్రీనివాస్‌ను బాలానగర్‌కు, అశోక్ కుమార్‌ను కీసరకు, వికారాబాద్ జిల్లాకు చెందిన సుధాలింగాను అల్వాల్ మండలానికి, సంగారెడ్డి జిల్లాకు చెందిన జె.స్వామిని కూకట్‌పల్లికి, సంగారెడ్డి జిల్లాకు చెందిన ఎం.సుజాతను కాప్రాకు, మేడ్చల్ జిల్లాకు చెందిన జి.కృష్ణను ఘట్‌కేసర్ మండలానికి, ఎల్.వెంకటేశ్వరరావును కీసర రెవెన్యూ డివిజన్ డీఏవోగా బదిలీ చేస్తూ పోస్టింగ్ ఉత్తర్వులు జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ జారీ చేశారు.

జిల్లా నుంచి బదిలీ అయిన తహసీల్దార్లు..

మేడ్చల్ జిల్లాలో తహసీల్దార్లుగా విధులు నిర్వర్తిస్తున్న ఎం.మహిపాల్‌రెడ్డి జనగామ జిల్లాకు, తహసీల్దార్లు పి.సంజీవరావు, ఎం.ఎస్తేర్ అనిత, కె.నాగమణి, వై.గౌరీవత్సల, ఎస్.ఆర్.సరిత సంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు. తహసీల్దార్లు ఎం.సురేందర్, ఆర్.గోవర్ధన్, కె.గౌతమ్‌కుమార్ రంగారెడ్డి జిల్లాకు బదిలీ కాగా, తహసీల్దార్ డి.అహల్య హైదరాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. వీరందర్నీ రిలీవ్ చేస్తూ కలెక్టర్ అమయ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూసుకుంటాం



భగత్‌సింగ్‌నగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే

కుత్బుల్లాపూర్: మెరుగైన వసతులు కల్పిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లో బుధవారం ఆయన ప్రగతియాత్రలో భాగంగా పర్యటించారు. ఈ సందర్భంగా రూ. కోటి నిధులతో చేపట్టబోయే సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భగత్‌సింగ్‌నగర్‌లో బస్తీ దవాఖానా, మల్టీపర్పస్ ఫంక్షన్‌హాలును పేదలకు అందుబాటులోకి తీసుకు వచ్చామన్నారు.

◆ బస్తీ దవాఖానాను సందర్శించి ఎమ్మెల్యేకు వైద్యులు అందుబాటులో ఉండటం లేదని స్థానికులు ఫిర్యాదు చేయగా సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అదే విధంగా స్థానికంగా హిందూ శ్మశానవాటికను మోడల్ గ్రేవ్‌యార్డుగా తీర్చిదిద్దే పనులను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. జలమండలి జీఎం శ్రీధర్ రెడ్డి, డీఈ శిరీష, ఏఈ సంపత్, వార్డ్ ఆఫీస్ సూపరింటెండెంట్ జవహర్, బస్తీ దవాఖాన మెడికల్ ఆఫీసర్ హరి ప్రసాద్ ఉన్నారు.

యూజీడీ నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలి

కుత్బుల్లాపూర్: భూగర్భ డ్రైనేజీలైన్‌కు అనుమతులు మంజూరు చేయాలని కొంపల్లి గ్రామ మాజీ సర్పంచ్ జెమ్మి నాగమణి దేవేందర్ దక్షిణ మధ్య రైల్వే అధికారులకు లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొంపల్లి మున్సిపల్ పరిధిలోని 4వవార్డు ప్రజలు డ్రైనేజీ ఔట్‌లెట్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గతంలో తాను సర్పంచ్‌గా ఉన్న సమయంలో హెచ్ఎండబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో కొంపల్లి బ్రిడ్జి సమీపంలో ఆల్వాల్ నుంచి మేడ్చల్ వరకు పైపులైన్ వేయడంతో కొంపల్లికి తాగునీరు అందుతోందన్నారు. కొంపల్లి మున్సిపల్ ప్రజల ఇబ్బందులను గుర్తించి బొల్లారం నుంచి గుండ్లపోచంపల్లికి వెళ్లే రైల్వేలైన్ సమీపంలో అండర్ పాస్ బ్రిడ్జి సమీపంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని వినతి కోరారు.

ఐదో వార్డుపై సన్న కవిత ఫోకస్



కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపాలిటీ ఐదో వార్డుపై మాజీ మండల పరిషత్ అధ్యక్షురాలు సన్న కవిత ఫోకస్ చేస్తుండటం స్థానికుల్లో చర్చ మొదలైంది. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో ఈ వార్డు నుంచి బరిలో నిలిచే ఆలోచన ఉండడంతో స్థానికంగా ఉన్న చిన్న చిన్న సమస్యలపై ప్రజలతో మమేకమవుతూ, తన భర్త ప్రస్తుతం మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్‌తో కలిసి హడావిడి చేస్తుండడంతో ..ఇప్పుడు చర్చగా మారింది. గడిచిన మున్సిపల్ ఎన్నికల్లో రెండో వార్డు నుంచి పోటీ చేసిన సన్న కవిత ఓటమిపాలయ్యారు.

◆ కుత్బుల్లాపూర్ ఎంపీపీగా ఐదేళ్లు పనిచేసిన ఆమె గెలిస్తే మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి ఖాయమని అందరు భావించినప్పటికీ ఓటమి చెందడంతో ప్లాన్ రివర్స్ అయ్యింది. ఆమె భర్త సన్న శ్రీశైలంయాదవ్ ఒకే ఒక ఓటుతో గెలిచి ఏకంగా చైర్మన్ కావడం విశేషం. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే ఐదో వార్డుపై ఫోకస్ చేస్తూ మంచినీటి సమస్య, అంగన్‌వాడీ సమస్యలు, డ్రైనేజీ జామ్ వంటి పనులను చేయిస్తూ ప్రజలకు దగ్గరవుతూ వస్తున్నారు. దీంతో సన్న కవిత ఐదో వార్డు నుంచి రాబోయే ఎన్నికల్లో ఇక్కడ నుంచి పోటీ చేస్తుందని పుకార్లు.. షికార్లు చేస్తున్నాయి.

విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించాలి



లీడర్లుగా ఎంపికైన విద్యార్థులకు బ్యాడ్జీలు అందజేసిన పాఠశాల డైరెక్టర్ కోటిరెడ్డి

కుత్బుల్లాపూర్: విద్యార్థుల్లో చిన్నతనం నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందిస్తే భవిష్యత్‌లో సమాజాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తారని బచ్‌పన్ స్కూల్ డైరెక్టర్ కోటిరెడ్డి అన్నారు. బుధవారం చింతల్ వెంకటేశ్వరనగర్‌లోని బచ్‌పన్ స్కూల్‌లో హెడ్ బాయ్, హెడ్ గర్ల్‌లతో పాటు వివిధ తరగతలకు లీడర్లను ఎంపికైన విద్యార్థులతో ఆయనతో పాటు కొంపల్లి దీక్ష కాలేజీ జనరల్ మేనేజర శ్రీకాంత్‌లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బ్యాడ్జీలు అందజేసి అభినందించారు. విద్యార్థి దశ నుంచే ఎన్నికల పట్ల అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం ఉన్నారు.



కట్ట మైసమ్మ బస్తీ ప్రధాన రోడ్డు బురదమయంగా మారడంతో నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు

సుభాష్‌నగర్: ఇటీవల కురిసిన వర్షాలకు గాజులరామారం డివిజన్ కట్టమైసమ్మ బస్తి ప్రధాన రోడ్డు బురదమయంగా మారింది. బుధవారం బస్తీ ప్రజలు బురద మాయంగా మారిన రోడ్డు వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ.. బస్తీలోకి వచ్చే ప్రధాన రోడ్డు చినుకు పడితే చిత్తడిగా మారుతోందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కనీసం నడవలేని పరిస్థితిలో ఉన్నామని తెలిపారు. బస్తీలోకి ఏదైనా వాహనం రావాలంటే రాలేని పరిస్థితిలో ఉందన్నారు. ఉదయం, సాయంత్రం వేళలో విద్యార్థులకు ఇబ్బందికరంగా మారిందని పేర్కొన్నారు. గతంలో సీసీ రోడ్డు మంజూరు కాగా ఓ వ్యక్తి వేరే చోట వేయించాడని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సీసీ రోడ్డు వేయాలని కోరుతున్నారు.